క్లుప్తంగా

సందడిగా యూకేజీ గ్రాడ్యుయేషన్ డే



గుంటూరు ఎడ్యుకేషన్: రాజేంద్రనగర్ 4వ లైనులోని కెనడీ నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్లో యూకేజీ చిన్నారులకు గురువారం స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పాఠశాల డైరెక్టర్ కె. శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యాసంవత్సరం పొడవునా వివిధ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారుల చిత్రాలతో కూడిన చిత్రమాలికను కెనడీ నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుదీర్ కృష్ణన్ బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎల్ హేమలత, చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ



నగరంపాలెం: వేసవిలో పాదచారుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేసినట్లు గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు కొనకళ్ల సత్యం అన్నారు. గుంటూరు పట్టణ ఫ్యాన్సీ, స్టేషనరీ, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్, గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కొత్తపేట ఫ్యాన్సీ కన్వెన్షన్ వద్ద ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వేసవిలోనూ కొత్తపేట వైపుగా రాకపోకలు సాగించే వారికి ఉచితంగా మజ్జిగ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



కొరిటెపాడు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ గుంటూరు మాడ్యూల్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం గుంటూరు మెయిన్ బ్రాంచి ఈ-కార్నర్ దగ్గర చలివేంద్రాన్ని డీజీఎం నరేంద్రకుమార్ చౌదరి, స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్, గుంటూరు మాడ్యూల్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ కె. కోటిరెడ్డి ప్రారంభించారు. పాదచారులు, వాహనదారులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు మెయిన్ బ్రాంచి ఏజీఎం ఎ.రాంప్రసాద్, చీఫ్ మేనేజర్ కిశోర్ కుమార్, ఆఫీసర్స్ అసోసియేషన్ చీఫ్ రీజినల్ సెక్రటరీ జయకుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ డీజీఎస్ సుధాకర్, ఏజీఎస్ విజయబాబు, సొసైటీ ప్రెసిడెంట్ శ్రీకృష్ణ మోహన్ బాబు, స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్, గుంటూరు మాడ్యూల్ ఆఫ్ బేరర్స్‌తో పాటు, గుంటూరులోని అన్ని బ్రాంచీల లోకల్ సెక్రటరీలు, మెంబర్స్ పాల్గొన్నారు. చలివేంద్రాన్ని వేసవి మొత్తం కొనసాగిస్తామని యూనియన్ నాయకులు చెప్పారు.

మే 20న రోడ్డు రవాణా కార్మికుల సమ్మె

లక్ష్మీపురం: లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా మే 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో రోడ్డు రవాణా కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం జి. శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ లేబర్ కోడ్ల అమలుతో బానిస వ్యవస్థను భారతదేశంలో మరలా తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, రాష్ట్ర కోశాధికారి కె. దుర్గారావు, నాయకులు సురేష్, పోలినాయుడు, కె. నాగేశ్వరరావు, బి. లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్ వలి, ఎం. హరిపోతురాజు, ఎం. రాజా, జి. శంకర్రావు, రాంబాబు, మహేష్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

చేబ్రోలు: యువకుడిని మోసం చేసి ద్విచక్రవాహనంతో పరారైన నిందితుడిపై గురువారం చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వేజండ్ల గ్రామానికి చెందిన షేక్ సిద్ధిఖ్ క్రికెట్ ఆటకని క్రీడా ప్రాంగణానికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. గుర్తు తెలియని వ్యక్తి ఎదురుగా వచ్చి తెలిసిన వారికి రోడ్డు ప్రమాదం జరిగిందని.. అడ్డరోడ్డు వరకు తీసుకువెళ్లాలని నమ్మబలికాడు. దీంతో సిద్ధిఖ్ అతనిని అడ్డరోడ్డులోని బస్టాండ్ వద్ద దింపాడు. బండి దిగిన నిందితుడు పనిపై వెళ్లి వస్తానని చెప్పి సిద్ధిఖ్ బండి తీసుకుని పరారయ్యాడు. దీంతో మోసపోయానని గ్రహించిన యువకుడు చేబ్రోలు పోలీసులకు జరిగింది తెలుపగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కుక్కలున్నాయి.. పిక్కలు జాగ్రత్త !

- నగరపాలక సంస్థ నిర్లక్ష్యం
- స్వర్ణభారతీనగర్‌లో కుక్క దాడిలో బాలుడి మృతి
- సీఎంతో సమావేశం అయిన నగరపాలక సంస్థ అధికారులు
- సీఎం ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన కుక్కలకు ఆపరేషన్లు చేయాలని ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశం
- పెద్దఎత్తున జీజీహెచ్‌కి వస్తున్న బాధితులు
- ఇంత వరకు ప్రారంభం కాని ఆపరేషన్లు



ఏటుకూరు రోడ్డులో కుక్కలకు ఆపరేషన్ జరిగే ప్రాంతం



కుక్క దాడిలో మృతి చెందిన బాలుడు(ఫైల్)

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో కుక్కల దాడుల్లో చిన్నారుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. 2017లో అడవితక్కెళ్లపాడులో ఓ బాలుడు కుక్కల దాడిలో మృతి చెందిన తరువాత తాజాగా ఈ నెల 6న స్వర్ణభారతీనగర్‌లో మరో బాలుడు గాయపడి మరణించాడు. ఈ సంఘటన మరువక ముందే ఈ నెల 9న అరుంధతీ నగర్‌లో మరో బాలుడిని కుక్క తీవ్రంగా గాయపరిచింది. దీంతో అప్పటికప్పుడు నగరపాలక సంస్థ అధికారులు కంటితుడుపు చర్యలు చేపట్టారు. నగరంలోని పలు కుక్కలను పట్టుకుని ఏటుకూరు ఏబీసీ సెంటర్‌కు తరలించారు. సీఎం చంద్రబాబు కూడా ఈ సంఘటనపై నగరపాలక సంస్థ అధికారులతో సీఎంఓలో ప్రత్యేక సమావేశమయ్యారు. ఏబీసీ ఆపరేషన్లు చేయాలని ఆదేశించారు. అయినా అధికారుల్లో చలనం లేదు. చిన్నారుల ప్రాణాలపై నగరపాలక సంస్థ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతోంది. ప్రతి రోజు ఏదో ఒక చోట కుక్క కాటుకు గాయాల పాలై జీజీహెచ్‌కు వస్తున్న వారు పదుల సంఖ్యలోనే ఉంటున్నారు. మరికొంత మంది జీజీహెచ్‌కు రాకుండా ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు.

గోల్‌మాల్ చేసిన ఆర్గనైజేషన్‌పై అధికారులకు ప్రేమ

నగరంలో వీధి కుక్కల నియంత్రణకు స్నేహ యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏటుకూరు రోడ్డులోని ఏబీసీ సెంటర్‌లో కుటుంబ నియంత్రణ(ఏబీసీ) ఆపరేషన్లు చేయిస్తున్నారు. కుక్కకు రూ.రెండు వేల దాకా నగరపాలక సంస్థ సదరు సంస్థకు చెల్లిస్తోంది. అయితే, జంతు ప్రేమికులు కొందరు ఆపరేషన్లలో లోపం ఉందని, స్టెరిలైజేషన్ సక్రమంగా ఉండటం లేదని, ఆపరేషన్ ద్వారా కుట్లు కూడా సక్రమంగా వేయడం లేదని, రికార్డ్స్ సక్రమంగా నిర్వహించడం లేదని యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేశారు. దీంతో యానిమల్ బోర్డ్ మెంబర్స్ గుంటూరు వచ్చారు. స్నేహ సొసైటీ నిర్వాహకుల ఆపరేషన్లలో లోపాలున్నాయని, చేయడానికి వీల్లేదని బోర్డ్ మెంబర్స్ చెప్పారు. దీంతో జనవరి 9 నుంచి ఏబీసీ ఆపరేషన్లు ఆగిపోయాయి. ప్రస్తుతం తిరిగి ఆ సంస్థకే కట్టబెట్టేందుకు నగరపాలక సంస్థ అధికారులు కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

కౌన్సిల్‌లో నిలదీత

కుక్క దాడిలో బాలుడు మరణించడంపై కౌన్సిల్ వేదికగా సభ్యులు అధికారులను నిలదీశారు. ఆపరేషన్లు చేసిన కుక్కల ద్వారా సంతానం ఉత్పత్తి ఏ విధంగా జరుగుతోందని ప్రశ్నించారు. అసలు ఆపరేషన్లు చేయకుండానే చేసినట్లు బిల్లులు పెట్టుకుంటారని మండిపడ్డారు. దీనిపై కౌన్సిల్ వేదికగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వెంకటేశ్వర్లు సమాధానమిచ్చారు. గుంటూరు నగరంలో 31,389 కుక్కలు ఉన్నాయని, వీటిలో 4,477 కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేశామని, వీటి కోసం రూ.37,48,500 ఖర్చు చేసినట్లు చెప్పారు.

నగరపాలక సంస్థ అధికారుల ఉదాసీనత

కుక్క దాడిలో ఈ నెల 6న బాలుడు చనిపోతే, 7న సీఎం చంద్రబాబు నగరపాలక సంస్థ అధికారులతో సీఎంఓలో ప్రత్యేక సమావేశమైయ్యారు. ఆ మరుసటి రోజు నుంచే యుద్ధప్రాతిపదికన ఏబీసీ ఆపరేషన్లు చేసి కుక్కలను కట్టడి చేయాలని, అవసరమైన డాక్టర్లను పశుసంవర్ధక శాఖ ద్వారా కోఆర్డినేట్ చేసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కానీ ఇంత వరకు ఆపరేషన్లు ప్రారంభం కాలేదంటే నగరపాలక సంస్థ అధికారులు ఎంత ఉదాసీన వైఖరితో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

త్వరలో ప్రారంభిస్తాం

ఏటుకూరు రోడ్డులో కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే పశుసంవర్ధక శాఖ నుంచి నలుగురు డాక్టర్లు డెప్యూటేషన్‌పై ఆపరేషన్లు చేసేందుకు అందుబాటులో ఉన్నారు. సోమవారం నుంచి కుక్కలకు ఆపరేషన్లు చేస్తాం.

– డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, నగరపాలక సంస్థ

రేపు గుంటూరులో రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ



కరపత్రాల ఆవిష్కరణలో పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నేతలు

నెహ్రూనగర్: క్రీస్తు పునరుత్థాన్ని పురస్కరించుకొని ప్రపంచ శాంతి, భారత దేశ సమైక్యత కోసం ఈ నెల 19వ తేదీ ఉదయం ఆరు గంటలకు గుంటూరు నగరంలో వివిధ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ పాస్టర్ రెవరెండ్ గనుపల్లి సతీష్ బాబు తెలియజేశారు. స్థానిక సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో గురువారం రన్ ఫర్ జీసస్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాస్టర్ జి.సతీష్ బాబు మాట్లాడుతూ క్రైస్తవులు, శాంతి సమాధానానికి చిహ్నమని తెలియజేస్తూ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం ఆరు గంటలకు నగరంపాలెంలోని వెస్ట్ పారిస్ చర్చి హయ్యర్ హాల్ నుంచి ప్రారంభమై కలెక్టరేట్, కంకరగుంట ఫ్లై ఓవర్, ఎన్టీఆర్ స్టేడియం, లక్ష్మీపురం, లాడ్జి సెంటర్, శంకర్ విలాస్, ఏసీ కాలేజీ వద్ద ర్యాలీ ముగుస్తుందని వివరించారు. నగరంలోని క్రైస్తవ విశ్వాసులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాస్టర్ మల్లెల రాజు, పాస్టర్ పాల్ మనోహర్, బాబు ఆశీర్వాదం, రత్న ప్రసాద్, ఆనందపాల్, విల్సన్, పరిశుద్ధరావు పాల్గొన్నారు.

ఈ-వేస్ట్ సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 19న నగరపాలక సంస్థ పరిధిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర భాగంగా ఈ-వేస్ట్ సేకరణపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర భాగంగా శనివారం ఈ-వేస్ట్ నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఈ-వేస్ట్ సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ-వేస్ట్ అందించే ప్రజలు తప్పనిసరిగా రశీదు పొందాలని ఆయన సూచించారు. సీఆర్డీఏ చేపట్టిన ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 విస్తరణ పనుల్లో భాగంగా స్వర్ణభారతీనగర్‌లో ప్రభావితమయ్యే ఆక్రమణదారుల్లో అర్హులకు ప్రభుత్వం నుంచి ఇప్పటికే ఇంటి పట్టాలు అందాయని, అనర్హులకు అందవని తెలిపారు. విస్తరణలో నష్టం జరిగే ఇళ్లకు చట్ట ప్రకారం నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. దీర్ఘకాలంగా పన్ను చెల్లించని వారిపై ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం చర్యలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. అనధికార మీడియా డివైస్ డిస్‌ప్లే బోర్డ్‌లను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో జీఎంసీనే తొలగిస్తుందని స్పష్టం చేశారు. అనధికార ట్యాప్ కనెక్షన్లు చట్టరీత్యా నేరమని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, వచ్చే నెల నుంచి పటిష్టంగా నిషేధం అమలు చేస్తామని తెలిపారు. వీధి వ్యాపారులు తప్పనిసరిగా ఫుట్‌పాత్‌కి వెనుకనే పెట్టుకోవాలని, త్వరలో రెండో వెండింగ్ జోన్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వీధి కుక్కలకు ఆపరేషన్లను సోమవారం నుంచి ప్రారంభిస్తామని, సుప్రీం కోర్ట్ మార్గదర్శకాల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

నగరపాలక సంస్థలో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తనకు అందించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. తన చాంబర్‌లో గ్రీవెన్స్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని విభాగాధిపతులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

25 నుంచి వేసవి శిక్షణ శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో ఈనెల 25 నుంచి వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి తెలిపారు. కళాశాలలో గురువారం శిబిరం పోస్టర్లను కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు ఆటవిడుపుతో పాటు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసాన్ని కలిగించే విధంగా స్పోర్ట్స్, గేమ్స్ అంశాల్లో శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కళాశాల వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీ మాట్లాడుతూ అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ, ఫుట్‌బాల్, రైఫిల్ షూటింగ్, టేబుల్ టెన్నిస్, చెస్, యోగా, ఆర్చరీ, వెస్ట్రన్ డాన్స్ వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రం, టీ షర్ట్, జ్ఞాపిక బహుకరిస్తామని వివరించారు. వివరాలకు 9849703144, 9849854221 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. అనితాదేవి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడించిన కాంగ్రెస్ పార్టీ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

గుంటూరు మెడికల్: అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ కుట్రతో రెండుసార్లు ఎన్నికల్లో ఓడించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆరోపించారు. స్థానిక చంద్రమౌళీనగర్ లోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ రచయిత మాత్రమే కాకుండా సామాజిక న్యాయం కోసం నిరంతరం శ్రమించిన శక్తివంతమైన వ్యక్తి అంబేడ్కర్ అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను ఎన్నో అవమానాలకు గురి చేసిందని చెప్పారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్ మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అంబేడ్కర్ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. అంబేడ్కర్ 134 వ జయంతి పక్షోత్సవాలను బీజేపీ ఆధ్వర్యంలో గుంటూరు గొట్టిపాటి కల్యాణ మంటపంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ధారా అంబేడ్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు వై.వి. సుబ్బారావు, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై ముగిసిన శిక్షణ తరగతులు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సూర్యనారాయణ, రామకృష్ణ ప్రభు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: సంగడి గుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్‌పై రెండు నెలల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ మాట్లాడుతూ డిగ్రీ చదువు జీవితంలో స్థిరపడేందుకు తోడ్పడుతుందని తెలిపారు. ఆధునిక టెక్నాలజీని సరైన రీతిలో ఉపయోగించుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయకుండా చక్కగా చదువుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులకు, చదువుకున్న విద్యాసంస్థకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. బాపూజీ విద్యాసంస్థల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగాలను పొందేందుకు ఇటువంటి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. శిక్షణ తీసుకున్న విద్యార్థులు నేర్చుకున్న అంశాల్లో రాణించాలని తెలిపారు. ప్రపంచాన్ని శాసిస్తున్న డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ జీవితంలో స్థిరపడేందుకు దోహదపడుతుందని అన్నారు. కళాశాల కోశాధికారి చందోలు జయప్రకాష్ మాట్లాడుతూ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత శిక్షణ కల్పించడం అభినందనీయమని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీధర్, చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలేయం.. శరీరంలో కీలకం

- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న లివర్ వ్యాధి బాధితులు
- విచ్చలవిడిగా మందుల వాడకంతో కూడా సమస్య
- లివర్ వ్యాధులను అశ్రద్ధ చేస్తే క్యాన్సర్‌గా మారే ప్రమాదం
- అందుబాటులో నేడు ఆధునిక చికిత్సలు
- రేపు వరల్డ్ లివర్ డే

పల్నాడు జిల్లాకు చెందిన శ్రీనివాస్ ప్రైవేటు ఉద్యోగి. కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే ప్రయత్నంలో సకాలంలో ఆహారం తీసుకునేవాడు కాదు. హోటల్స్‌లో ఫాస్ట్ ఫుడ్స్ తింటూ కాలం గడుపుతున్నాడు. పైగా సహచరులతో కలిసి మద్యానికి అలవాటు పడి, అనారోగ్యానికి గురయ్యాడు. డాక్టర్లు పరీక్షలు చేసి మద్యం వల్ల కాలేయానికి తీవ్ర సమస్య వచ్చిందని నిర్ధారించారు. మద్యానికి స్వస్తి పలకాలని గట్టిగా చెప్పారు. వైద్యుల సలహాలతో మందులు వాడని పక్షంలో ప్రాణాలకే ప్రమాదముందని హెచ్చరించారు.



గుంటూరు మెడికల్: కాలేయం (లివర్) మన శరీరంలో అతి పెద్ద గ్రంథి. అది పనిచేయకపోతే అనేక రోగాలు చుట్టుముడతాయి. ఆధునిక జీవనశైలి వల్ల నేడు పలువురు లివర్ వ్యాధుల బారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది. లివర్ వ్యాధులను సకాలంలో గుర్తించి వైద్యం చేయించని పక్షంలో క్యాన్సర్‌గా మారే ప్రమాదముంది. లివర్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది ఏప్రిల్ 19న వరల్డ్ లివర్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

పెరుగుతున్న బాధితులు

గుంటూరు జీజీహెచ్‌లో గ్యాస్ట్రోఎంట్రాలజీ ఓపీ వైద్య విభాగంలో ప్రతిరోజూ 150 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో 60 మంది లివర్ సంబంధిత సమస్యలతో చికిత్స పొందుతున్నారు. రోజు రోజుకూ రోగుల సంఖ్య పెరుగుతుండటంతో వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 15 మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉండగా ప్రతి రోజూ ఒక్కో వైద్యుడి వద్దకు ఐదుగురు లివర్ సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు.

లివర్ చేసే పనులు

ఉదరంలో ఉదరవితానికి కిందగా కుడి వైపున మధ్యలో కాలేయం ఉంటుంది. మనం తినే ఆహారాన్ని జీర్ణం చేయడం, అందుకు దోహదపడే పైత్య రసాన్ని ఉత్పత్తి చేయడం, శరీరంలోని కొవ్వు, చక్కెర, ప్రోటీన్ శాతాన్ని నియంత్రిస్తుంది. శరీరం జబ్బు బారిన పడకుండా రక్షణ కల్పించడం, రక్త శుద్ధి చేయడం, శరీరంలోని విషాలను హరించడం చేస్తుంది. ఆహారాన్ని శక్తి రూపంలోకి మార్చడం, వివిధ హార్మోన్ల విడుదలను నియంత్రణలో పెట్టడం, రక్తం గడ్డ కట్టడానికి, గాయాలు త్వరగా మానటానికి కావాల్సిన ఎంజైమ్స్‌ను ఉత్పత్తి చేయడం వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తుంది.

కాలేయ సమస్యలకు ముఖ్య కారణాలు

మత్తు పదార్థాలు సేవించడం, పొగ తాగడం, కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, ఇన్ఫెక్షన్స్ వల్ల కాలేయ సమస్యలు వస్తాయి. లైంగిక సంబంధాలు, ఒకరికి వాడిన సూదిని మరోకరికి వాడటం వల్ల హెపటైటిస్- బి, సి వ్యాధులు సోకుతాయి. కలుషిత రక్తమార్పిడి, కలుషిత నీరు, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల హెపటైటిస్ ఏ,ఈ వ్యాధులొస్తాయి. శారీరక వ్యాయామం లేకపోవడం, స్థూల కాయం వల్ల కొవ్వు పెరిగి కాలేయంపై పేరుకుపోతుంది. నూనె వస్తువులు ఎక్కువగా తినడం, పిజ్జాలు, బర్గర్సలు, ఫాస్ట్‌ఫుడ్ వల్ల లివర్ వ్యాధులు వస్తాయి. శరీరానికి హానిచేసే మందులు ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా కాలేయ సమస్యలు తలెత్తుతాయి. మన రోగ నిరోధకశక్తి మన వైపే ప్రతికూలంగా పనిచేయడానికి అవకాశం ఉన్నప్పుడు, వంశ పారంపర్యంగా కాలేయ వ్యాధులు వస్తాయి. తెల్లగా ఉండే కళ్లు పసుపు పచ్చగా, గోళ్లు పసుపు రంగులో మారితే కామెర్ల సమస్యలు ఉన్నట్లు భావించి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ముందస్తుగా గుర్తించి సకాలంలో వైద్యం చేయని పక్షంలో క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉంది.

జీజీహెచ్‌లో చికిత్స పొందిన వారి వివరాలు	
2022లో	1500
2023లో	1720,
2024లో	2090
2025లో	520
(జనవరి నుంచి మార్చి 30 నాటికి)	

జీజీహెచ్‌లో ఉచితంగా వైద్యసేవలు

గుంటూరు జీజీహెచ్‌లో లివర్ జబ్బులకు అత్యాధునిక వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నారు. జబ్బులను ముందస్తుగానే గుర్తించి చికిత్స అందించేందుకు, లివర్‌ను దెబ్బతీసే వైరస్‌లకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. హెపటైటిస్-బి వైరస్ నియంత్రణ కోసం ప్రతినెలా రూ.2000 ఖరీదు చేసే మందులు ఉచితంగా ఇస్తున్నారు. హెపటైటిస్-సి జబ్బులకు ఉచితంగా రూ. 20,000 ఖరీదు చేసే మందులు ఉచితంగా ఇస్తున్నారు.

లివర్ క్యాన్సర్లకు కారణం



లివర్ క్యాన్సర్లు రావటానికి హెపటైటిస్- బి, హెపటైటిస్-సి వ్యాధులే కారణం. కామెర్ల వ్యాధి (జాండీస్) సోకిన వారు తప్పనిసరిగా నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి. శరీరంలో హెపటైటిస్ వైరస్ ఆరు నెలల కంటే ఎక్కువ కాలం ఉంటే క్రానిక్ హెపటైటిస్‌కు దారి తీసి కొన్నేళ్ల తరువాత లివర్ దెబ్బతినటానికి కారణమవుతుంది. దీని వల్ల లివర్ క్యాన్సర్, లివర్ ఫెయిల్యూర్, లివర్ సిరోసిస్ వస్తుంది.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణురాలు, గుంటూరు

లివర్‌ను కాపాడుకోవాలి



ఆల్కాహాల్ వల్ల లివర్ దెబ్బ తింటుంది కాబట్టి మద్యం జోలికి వెళ్లవద్దు. కొవ్వు పదార్థాలు, వేపుళ్లు అతిగా తినొద్దు. ఉప్పు, చక్కెర, రెడ్ మీట్ ఎక్కువ మోతాదులో తీసుకోవద్దు. పచ్చని ఆకు కూరలు తినడం వల్ల లివర్‌ను శుభ్రంగా ఉంచుతాయి. ఆలీవ్ ఆయిల్స్, వాల్‌నట్స్, గ్రీన్ టీ, ఆపిల్ పండ్లు, వెల్లుల్లి పాయలు, పసుపు లివర్‌కు మేలు చేస్తాయి. విటమిన్ సీ ఎక్కువగా తీసుకుంటే కాలేయం వద్ద పేరుకుపోయే కొవ్వును నియంత్రణ చేస్తుంది. రోజూ నీటిని ఎక్కువగా తాగడం వల్ల కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది.

– డాక్టర్ షేక్ నాగూర్ బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

ఉద్యోగాలకు 185 మంది విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్రం, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 185 మంది డిగ్రీ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్న కుమారి తెలిపారు. 19 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారని ఆమె చెప్పారు. వివిధ కళాశాలల నుంచి 419 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ముత్తూట్ ఫైనాన్స్, మాస్టర్‌మైండ్స్, మెడ్‌ప్లస్, అపోలో ఫార్మసీ, ఎస్‌బీఐ పేమెంట్స్, ఇన్నో సోర్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఆమె అభినందించారు. జాబ్‌మేళాలో జేకేసీ సమన్వయకర్త డాక్టర్ కె. అపర్ణ సీతారామ్, మెంటార్లు యూనిస్‌ఖాన్, అపర్ణ, లక్ష్మణరావు, సుబ్బారెడ్డి, పవన్, చేబ్రోలు, వినుకొండ, బాపట్ల, మాచర్ల, చీరాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

చేబ్రోలు: ఆటో ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలైన సంఘటన మండలంలో గురువారం జరిగింది. శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన షేక్ మున్నా నారాకోడూరు ప్రాంతంలో పుచ్చకాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పుచ్చకాయల బండితో రోడ్డు పక్కన వెళుతున్న మున్నాను వెనుక నుంచి వచ్చి ఆటో వేగంగా ఢీకొట్టడంతో గాయాలయ్యాయి.